జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 9-5-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 667 పేజీలు: 4 వెల : రూ.7

# అద్దె గదులపై.. తొలగని..
# ప్రతిష్టంబన!

* రెండు నెలలుగా వసూలు కాని అద్దెలు
* పంచాయతీ ఆదాయానికి గండి
* అద్దెలు తగ్గించాలని కోరుతున్న వ్యాపారులు
* సాధ్యం కాదంటున్న జిల్లా అధికారులు

సోంపేట, మే 8(వార్త): సోంపేట మేజర్ పంచాయతీకి ఆదాయం కల్పించే వనరులలో ఒకటైన అద్దె గదుల వ్యవహారం ఇప్పటికి ఓ కొలిక్కి రాలేదు. దీనిపై ఇంకా ప్రతిష్టంబన కొనసాగుతోంది. మార్చిలో జరగాల్సిన వేలం పాటలు జరగకపోవడం మరోవైపు వ్యాపారులు గదుల అద్దెలు తగ్గించేందుకు నేతల ద్వారా ముమ్మర ప్రయత్నాలు చేయడం చివరకు జిల్లా కలెక్టర్ సైతం అద్దెలు తగ్గింపునకు ససేమిరా అనడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి వ్యాపారుల్లో నెలకొంది. దీంతో ఏప్రిల్ నేల నుంచి వసూలు కావలసిన అద్దెలు వసూలు కాకపోవడంతో పంచాయతీ ఆదాయం కూడా తగ్గిపోతుంది. వివరాల్లోకి వెళితే గత పాలకవర్గం హయాంలో ప్రారంభంలోనే ఏడాదికాల పరిమితికి గదులకు వేలం వేయకుండా ఐదేళ్ల కాళ్ల పరిమితికి నిర్ణయించి అద్దె ధరలను నిర్ణయించారు. వాటిపై ప్రతి ఏటా 10 శాతం పెంచుకునేలా పంచాయతీకి అవకాశం కల్పించారు. దీంతో చివరి ఏడాది నాటికి షాపులకు గరిష్టంగా అద్దె 17 వేల రూపాయలకు చేరడం గమనార్హం. గ్రామపంచాయతీ పరిధిలో మొత్తం 42 షాపులు ఉన్నాయి. ప్రస్తుతం కనీసం గా 5000 రూపాయల నుంచి గరిష్టంగా 17 వేల రూపాయల వరకు అద్దెలు చేరడంతో వ్యాపారులకు ఇది కాస్త భారంగా మారింది. ఇటీవల మార్చిలో నిర్వహించిన పంచాయతీ వేలంపాట్లకు ముందుగానే వ్యాపారులు ఐక్యమై ప్రజాప్రతినిధులను ఆశ్రయించారు. భారీ స్థాయిలో పెరిగిపోయిన అద్దెలను తగ్గించాలని వ్యాపారాలు సరిగా సాగడం లేదని ఇలా అయితే అద్దెలు చెల్లించడం చాలా కష్టంగా మారుతుందని బాధలు చెప్పుకోవడంతో ప్రజాప్రతినిధులు సైతం జిల్లా అధికారులతో మాట్లాడి అద్దెలు తగ్గించే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. దీనిపై ఆశలు పెట్టుకున్న వ్యాపారులకు జిల్లా కలెక్టర్ నీళ్లు చల్లారని తెలుస్తోంది. ఇటీవల కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సోంపేట కవిటి మండలాల్లో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా కలెక్టర్ సైతం హాజరైన విషయం తెలిసిందే. ఆ సందర్భంలో ఉన్నత స్థాయి ప్రజా ప్రతినిధి సోంపేట పంచాయతీ గదుల అద్దె విషయమై మాట్లాడుతూ వ్యాపారులకు ఇబ్బందికరంగా ఉన్న దృష్ట్యా అద్దెలు తగ్గించే ఏర్పాటు చేయాలని చేసిన విజ్ఞప్తిని కలెక్టర్ సున్నితంగా కాదన్నట్లు తెలిసింది. దీంతో గ్రామపంచాయతీ అధికారులు తమ నిర్ణయాన్ని అమలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే ఒకసారి నిర్ణయించిన అద్దెలను తగ్గించే అవకాశం లేదంటూ పంచాయతీ కార్యాలయం వర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికే గ్రామపంచాయతీలో ఈ ఏడాది అన్ని రకాల వేలం పాటలు పూర్తిగా విఫలమైన సంగతి తెలిసిందే. డైలీ మార్కెట్, కారు బస్టాండు వేలంపాట్ల విషయంలో పాటదారులంతా సిండికేట్ గా మారి తమదైన రీతిలో వేలంపాటలు లేకుండా డిపార్ట్మెంట్ కలెక్షన్ పేరుతో కొంతమంది అధికార పార్టీ నేతలు ఈ కలెక్షన్ వ్యవహారాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నట్లు సోంపేటలో టాక్ నడుస్తోంది. ఈ రెండు వేలంపాట్ల ద్వారా సుమారు 30 లక్షల రూపాయల పంచాయతీ ఆదాయానికి భారీగా గండి పడే పరిస్థితులు నెలకొన్నాయి. కనీస పారదర్శకత లేకుండా చేపడుతున్న ఆశీళ్ల వసూళ్లు వారి దయాదాక్షిన్యాలపై ఆధారపడి ఉన్నాయి. దీనికి తోడు పంచాయతీ అద్దె గదుల వ్యవహారం కూడా జటిలంగా మారింది.

దీంతో గ్రామపంచాయతీ ఆదాయంపై అధికారుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. పారిశుద్ధ్య సిబ్బందికి చాలీచాలని జీతాలు: ఇప్పటికే మేజర్ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందికి చాలీచాలని జీతాలు చెల్లిస్తున్నారు. గ్రామపంచాయతీ ఆదాయంపైనే వీరి జీతభత్యాలు ఆధారపడి ఉంటాయి. ఇప్పటికే వారి నుంచి ఆందోళన వ్యక్తం అవుతున్న నేపథ్యంలో ఈ ఏడాది పంచాయతీ ఆదాయం మరింత తగ్గే అవకాశం ఉండడంతో పారిశుద్ధ్య సిబ్బంది జీతాలు పెంచే అవకాశం లేదంటూ తెలుస్తోంది. రాబోవు రోజుల్లో పంచాయతీ కార్మికులు జీతాల విషయమై రోడ్డు ఎక్కే పరిస్థితి తప్పకపోవచ్చని పలువురు భావిస్తున్నారు. ఈ పరిస్థితి ఇలా ఉండగా వ్యాపారులు మాత్రం గదుల అద్దె తగ్గింపు కోసం అధికార పార్టీ నేతలు చుట్టూ ప్రదక్షిణలు చేయడం ఎంతవరకు సమంజసమని మరి కొంతమంది ప్రశ్నిస్తున్నారు. ఈ పరిస్థితికి ప్రధాన కారణం గత పాలకవర్గంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఓ వ్యక్తి తీసుకున్న నిర్ణయమే నంటూ పలువురు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనప్పటికీ ఎన్నడూ లేని విధంగా సోంపేటలో చోటామోటా నేతల చేతుల్లోకి పంచాయతీ అజమాయిషీ వెళ్లడం ఏ మాత్రం సరి కాదని స్థానికులు పేర్కొంటున్నారు.






## మతిస్థిమితం లేని వ్యక్తికి దేహశుద్ధి

* దొంగ అనుకుని చితగ్గొట్టిన కొందరు యువకులు
* చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు: సీఐ

పలాస, మే 8 (వార్త): పలాస కాశీబుగ్గలో దొంగ అన్న అనుమానంతో గుర్తు తెలియని వ్యక్తిని కొందరు యువకులు విద్యుత్ స్తంభానికి కట్టి దాడి చేసిన ఘటన కలకలం రేపింది. పలాసలోని రెడ్డిక వీధి జంక్షన్ వద్ద బైక్‌లను తోసేస్తున్నాడని అనుమానించి అతడిని అడ్డుకున్నట్లు స్థానికులు తెలిపారు. అనంతరం అతడిని స్తంభానికి కట్టేసి దాడి చేశారు. సవర భాషలో మాట్లాడుతున్న ఆ వ్యక్తి మతిస్థిమితం సరిగా లేని వ్యక్తిగా పోలీసులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న కాశీబుగ్గ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని బాధితుడిని రక్షించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రాథమిక వైద్య పరీక్షల నిమిత్తం పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలను అందజేశారు. వైద్య పరీక్షల అనంతరం అతడిని విశాఖ మానసిక వైద్యశాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాశీబుగ్గ సీఐ వై రామకృష్ణ మాట్లాడుతూ ప్రజలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదన్నారు.



బాటిల్‌పై రూ.10లు

## అదనంగా వసూల్!

* అధిక ధరలకు మద్యం విక్రయాలు
* నౌపడ మద్యం షాపు వద్ద మందుబాబుల ఆందోళన
* బెల్టు షాపులకు తరలిపోతున్న మంచి బ్రాండ్లు
* బెల్టుల వద్ద నుంచి ఒక్కో బాటిల్‌కు రూ.30లు అదనం
* మద్యం షాపుల్లో చీప్ విక్రయాలు
* ప్రశ్నిస్తే అంతా మా ఇష్టం అంటూ సమాధానం
* మౌనం వహించిన ఎక్సైజ్ శాఖ




సంతబొమ్మాళి, మే 8 (వార్త): నౌపడలోని మద్యం షాపులో ఎమ్మార్పీకి మించి అధిక ధరలకు మద్యం అమ్మకాలు చేస్తున్నారని మందుబాబులు శుక్రవారం ఆందోళనకు దిగారు. కొద్దిరోజుల నుండి నౌపడ మద్యం షాపులో అధిక ధరలకు మద్యం అమ్మకాలు చేసి మందు బాబుల నుండి దోపిడీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రతి బాటిల్‌పై పది రూపాయలు ఎక్కువ తీసుకుంటున్న పట్టించుకునే నాధుడే లేడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.130 రేటున్న మద్యం బాటిల్‌ను రూ.140కి అమ్మకాలు చేస్తున్న ఎక్సైజ్ శాఖ కనీసం పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. కొన్ని బ్రాండ్లు అమ్మకాలు నిలిపేసి బెల్ట్ షాపులకు సప్లై చేస్తున్నారన్నారు. బెల్ట్ వారి దగ్గర బాటిల్‌పై రూ.30 అధికంగా తీసుకొని బెల్ట్ షాపులో వారికి లైసెన్స్ షాపుల వారే ప్రోత్సహిస్తున్నారని బహిరంగంగానే విమర్శిస్తున్నారు. మందుబాబులు షాపు వద్ద అడిగితే నిర్వాహకులు దురుసుగా మాట్లాడుతున్నారని సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు స్పందించి ఎమ్మార్పీకే మద్యం అమ్మకాలు జరిగేలా చర్యలు చేపట్టాలని మందుబాబులు కోరుతున్నారు.

## హ్యాండ్లూమ్ టెక్నాలజీ డిప్లొమా కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం, మే 8(వార్త): తిరుపతి జిల్లా వెంకటగిరిలోని శ్రీ ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో మూడేళ్ల డిప్లొమా కోర్సు ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు మెరిట్ ప్రాతిపదికన ఈ కోర్సులో చేరవచ్చు. అలాగే ఇంటర్ లేదా రెండేళ్ల ఐటీఐ పూర్తి చేసిన వారు నేరుగా రెండో సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు అవకాశం కల్పించారు. ఎంపికైన విద్యార్థులకు ప్రభుత్వం నెలకు రూ. 2500 స్టైపెండ్ అందజేస్తుంది. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి ప్రముఖ వస్త్ర పరిశ్రమల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ద్వారా తక్షణ ఉపాధి లభిస్తుంది. అంతేకాకుండా, చేనేత, జౌళి శాఖలో ప్రభుత్వ ఉద్యోగాలకు వీరు అర్హులు. పై చదువులు చదవాలనుకునే వారు నేరుగా బీటెక్ రెండో సంవత్సరంలో చేరవచ్చు. ఆసక్తి గల అభ్యర్థులు మే 30వ తేదీలోగా www.iihtvgr.com వెబ్‌సైట్ ద్వారా లేదా 9399936872, 9866169908 నంబర్లను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సంస్థ ప్రతినిధులు కోరారు.

# రెడ్ క్రాస్ సేవలు.. అభినందనీయం

* రక్తదానంతో థలసేమియా వ్యాధిగ్రస్థులకు ప్రాణదానం
* జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరరావు
* థలసేమియా రహిత జిల్లాగా మార్చాలి
* జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ జగన్మోహన్ రావు
* రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు జీన్ హెన్రీ డ్యూనెంట్ చిత్రపటానికి నివాళి
* థలసేమియా నివారణకు నగరంలో అవగాహన ర్యాలీ




శ్రీకాకుళం, మే 8 (వార్త): మానవతా దృక్పథంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అందిస్తున్న సేవలు అభినందనీయమని డీఆర్వో వి.విశ్వేశ్వరరావు అన్నారు. ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం, ప్రపంచ థలసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత రెడ్ క్రాస్ వ్యవస్థాపకుడు సర్ జీన్ హెన్రీ డ్యూనెంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. థలసేమియా వ్యాధి నివారణపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ఆర్ అండ్ బి బంగ్లా నుండి బాదుల్ పేట వరకు భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ థలసేమియా నివారణకు ముందస్తు జాగ్రత్తలు అవసరమని, రక్తదాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బాధితులను ఆదుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ పి. జగన్మోహన్ రావు మాట్లాడుతూ.. రక్తదాన శిబిరాలు, పౌష్టికాహార కిట్ల పంపిణీ ద్వారా బాధితుల్లో భరోసా కల్పిస్తున్నామని, భవిష్యత్తులో జిల్లాను థలసేమియా రహితంగా మార్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రముఖ వైద్యులు గొండు గంగాధర్ రావు, మూల వెంకట్రావు మాట్లాడుతూ రెడ్ క్రాస్ ద్వారా అందుతున్న ఉచిత రక్తమార్పిడి, మందులు, పరీక్షల సదుపాయాలు బాధితులకు ఎంతో మేలు చేకూరుస్తున్నాయని ప్రశంసించారు. జిల్లా కార్యదర్శి బి. మల్లేశ్వరరావు మాట్లాడుతూ సంస్థ ప్రగతిలో వాలంటీర్ల కృషి వెలకట్టలేనిదన్నారు. కార్యక్రమంలో భాగంగా సేవా రంగంలో ప్రతిభ కనబరిచిన ఉత్తమ సిబ్బందికి డీఆర్ఓ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు కనుగుల దుర్గ శ్రీనివాసరావు, పి. శ్రీకాంత్, ఎం. కళ్యాణ్ చక్రవర్తి, పి. వైకుంఠరావు, ప్రతినిధులు కె. సత్యనారాయణ, జి. రమణ, బి. సతీష్ కుమార్, పి. చైతన్య కుమార్, సాయి, నర్సింగరావు, గుణాకర రావు, పేట్రన్స్, వైస్ పేట్రన్స్, సీనియర్ సిటిజన్ సంఘం సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.






## ముమ్మరంగా సాగుతున్న జనగణన

**జి.సిగడాం, మే8(వార్త):** జనగణన సర్వేలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పంచాయితీ కార్యదర్శి మజ్జి ధనలక్ష్మీ తెలిపారు.శుక్రవారం మండలంలో జగన్నాధ వలస, పెంట, ఆనందపురం, జాడ, జి.సిగడాం తదితర గ్రామాల్లో జనగనణన సర్వే ముమ్మరంగా సాగుతోంది. జనగనణ ఎమ్యునేటర్స్ ఇంటింటి వెళ్లి తోలి దశలో 33 ప్రశ్నలలో ఈ జనగణన ప్రక్రియ నిర్వహిస్తున్నారు.కుటుంబ పెద్ద పేరు, సెల్‌ఫోన్ నంబరు, ఈమెయిల్ ఐడీని నమోదుచేస్తే సెల్‌ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. అది నమోదు చేయగానే అక్కడ ప్రశ్నలకు అనుగుణంగా సమాధానాలు ఇవ్వాలి. 11 అంకెలతో కూడిన ఐడీ వస్తుంది. దానిని భద్రపరుచుకొని జనగణన చేపట్టే సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు ఆ ఐడీని ఇవ్వాలి. స్వయంగా నమోదుచేసుకున్న వివరాల్లో ఏమైనా తప్పులు ఉంటే వాటిని సరిచేసుకునే వెసులబాటు కూడా ఉందన్నారు. మే 1 నుంచి ప్రారంభమైన ఈ జనగణన ఈ నెల 31 లెక్కింపు ఉంటుందన్నారు.దేశ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమల్లో జనగణన కీలకంగా ఉంటుందని. అందుకే ప్రజలంతా భాగస్వామ్యం అయ్యేలా.. అన్ని కుటుంబాల వివరాలను సేకరించేలా ప్రభుత్వం అడి కార్డులతో ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు.



# గిరిజన పీజీఆర్‌ఎస్‌కు 23వినతులు

**మందస, మే 8(వార్త):** గిరిజన సమస్యలు పరిష్కరించడానికి మందస పట్టణంలో గిరిజన పీజీఆర్‌ఎస్ నిర్వహించారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పవార్ స్వప్నిల్(సీతంపేట) ఆధ్వర్యంలో అధికారులు గిరిజనుల నుంచి వినతులు స్వీకరించారు. బంసుగాం గ్రామానికి చెందిన సవర గంగారావు తమ గ్రామానికి కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. కుసుమాల గ్రామానికి చెందిన రామకృష్ణ త్రాగునీటి వాటర్ ట్యాంకు మంజూరు చేయాలని, కుసుమాల గ్రామానికి చెందిన సవర రామకృష్ణ రోడ్డు పనులను వేగవంతం చేయాలన్నారు. కాలువలు మంజూరు చేయాలని కుసుమాల గ్రామానికి చెందిన సవర దాశరధి, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని నువాగడ గ్రామానికి చెందిన చైతన్య బిసాయి కోరారు. రోడ్డు పనులు మరమ్మత్తు చేయాలని పట్టులోగాం గ్రామానికి చెందిన సవర హరికృష్ణ, సీసీ రోడ్డు మంజూరు చేయాలని పట్టులోగాం గ్రామానికి చెందిన సవర నర్సింగరావు వినతి పత్రం సమర్పించారు. పాఠశాల మంజూరు చేయాలని, ఆంధ్ర-ఒడిశా సరిహద్దు గ్రామాలకు కనెక్టివిటీ రోడ్డు మంజూరు చేయాలని కుడుమసాయి గ్రామానికి చెందిన సవర రాజు కోరారు. వ్యవసాయ బావులకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేయాలని సవరమధ్య గ్రామానికి చెందిన సవర చంద్రశేఖర్, వంతెన మంజూరు చేయాలని సవరమధ్య గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ వినతిపత్రం సమర్పించారు. ఒరిస్సా అధికారుల నుంచి ఎదురవుతున్న వేధింపుల నుండి రక్షణ కల్పించాలని మాణిక్యపట్నం గ్రామానికి సవర గురునాథం వినతిపత్రం సమర్పించారు. మంచినీటి బోరు మంజూరు చేయాలని మాణిక్యపట్నం గ్రామానికి చెందిన విప్రో కోరారు.



కార్యక్రమంలో పలాస ఆర్డీవో జి.వెంకటేష్, మందస తహసీల్దార్ మిస్క శ్రీకాంత్, డిప్యూటీ ఎంపీడీవో పి.జయకుమార్, హౌసింగ్ నరసింగరావు, జీసీడీవో రాములమ్మ, వెలుగు డీపీఎం రమణ తదితరులు పాల్గొన్నారు.

## స్ఫూర్తి ప్రదాత డాక్టర్ సర్వేపల్లి

### -ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా



**మెళియాపుట్టి, మే 8(వార్త):** తను ఏ స్థానంలో ఉన్న అక్కడి నుంచే సమాజంలో మార్పులను తీసుకొచ్చి పదిమందికి ఆదర్శప్రాయముగా నిలబడిన స్ఫూర్తి ప్రదాత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ అని ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా అన్నారు. మెళియాపుట్టి మండలం పరిధిలో గల శిరియాఖండి గ్రామంలోనున్న స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గ్రామానికి చెందిన సింహాచల మిస్రో, సరస్వతి దంపతులు శుక్రవారం నాడు ఏర్పాటుచేసిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ సమాజానికి ఏ రకమైన సేవలు అందించింది, వివిధ సంస్కరణలు చేపట్టి సమాజాన్ని ముందుకు నడిపించింది తదితర అనేక అంశాలను ఎంపీడీవో నరసింహ ప్రసాద్ బండ, మండల విద్యాశాఖ అధికారులు దేవేంద్రావు, మల్లారెడ్డి పద్మనాభం తదితరులు అనేక అంశాలను తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో వారితో పాటుగా మాజీ ప్రజా ప్రతినిధి, విశ్రాంత ఉపాధ్యాయులు లింగాల సంజీవరావు మాస్టారు, మాజీ సర్పంచ్ భాస్కర్ గౌడ్, పడాల భాస్కరరావు, యూత్ అధ్యక్షులు ఆర్. గౌరీష్ బాబు, ఎస్ఎంసి చైర్మన్ కృష్ణవేణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, శాంతి, రామారావు, జన్ని సంపత్ రావు, కార్యదర్శి కల్పన, వైద్య ఆరోగ్య, సచివాలయ సిబ్బంది, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించడానికే సర్వసభ్య సమావేశం



**జి.సిగడాం, మే 8(వార్త):** ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్క అధికారి ప్రజలతో మమేకమై సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ మీసాల సత్యవతి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మీసాల వెంకటరమణ అన్నారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జి. రామకృష్ణారావు ఆద్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి విచ్చేసిన అదికారులు వారు తీసుకొని వచ్చిన నివేదికలను సభ్యులకు చదివి వినిపించారు. రైతులు పండించిన మొక్క జొన్న పంటలను ప్రభుత్వం సకాలం రైతు గిట్టుబాటు ధర వచ్చే ల కొనుగోలు చేసే విధంగా చూడాలని సభ దృష్టికి తీసుకొనివచ్చారు. అంగన్వాడీ మరియు ఉపాది హామి పనులు, గృహల మంజూరు విషయాలను సభ్యులు సభ దృష్టికి తీసుకొనివచ్చారు. వేసవి సీజన్ దృష్టిలో పెట్టుకొని వైద్య అదికారులు ప్రజల ఆరోగ్యంపై పలు సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కాయల రమణ, వైస్ ఎంపీపీ మీసాల స్వాద్వీమణి,తోలేటి వెంకట్రావు, డీటీ ఎన్. నిర్మల,ఎంఈఓ అరసాడ రవి,ఎఓ బాజ్జి, ఎపీఓ చోళ్ల సత్యనారాయణ, ఏపీఎం రెడ్డి రామకృష్ణ, వైద్య అదికారులు, సుమబిందు, ఎఈ ఈ యువరాజు,కుసుమ, ఎంపీటీసీలు ఉన్నారు.

## గర్భిణులు సమతుల్య ఆహారం తీసుకోవాలి



**సారవకోట, మే 8 (వార్త):** గర్భిణీలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ సమతుల్య ఆహారం తీసుకోవాలని సారవకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుడు గురుమూర్తి సూచించారు. శుక్రవారం సారవకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్ష మాతృ వందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 26 మంది గర్భిణీలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు అందించారు. గర్భిణీలు తీసుకునే ఆహారంలో ఐరన్, విటమిన్లు, పోషకాలు సమృద్ధిగా ఉండేలా చూసుకోవాలని వైద్యుడు తెలిపారు. గర్భధారణ సమయంలో సరైన పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లి, శిశువు ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని వివరించారు. అదేవిధంగా గర్భిణీలు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్య సిబ్బంది సూచనలు పాటించాలని సూచించారు.

## డంపింగ్ యార్డ్ ఆధునికీకరణ పనులు వేగవంతం

**నరసన్నపేట, మే 8(వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీ పరిధిలోని డంపింగ్ యార్డ్ ఆధునికీకరణ పనులు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయి. శుక్రవారం అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను పెద్ద ఎత్తున చేపట్టారు. తడి, పొడి చెత్తను శాస్త్రీయంగా నిర్వహిస్తూ కంపోస్ట్ తయారీకి ఉపయోగపడే నూతన యంత్రాన్ని డంపింగ్ యార్డ్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ చర్యలతో చెత్త నిర్వహణ మరింత సమర్థవంతంగా మారుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తున్నందుకు జగన్నాథపురం, పెద్దపేట, సత్యవరం గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో చెత్త సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రాంతాల్లో ఇప్పుడు పరిశుభ్రత మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ప్రజలకు ఉపయోగకరంగా మారనున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.





# రోగులకు సకాలంలో వైద్య సేవలందాలి

### -ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పవార్ స్వప్నిల్

**మందస, మే 8(వార్త):** రోగులకు సకాలంలో వైద్య సేవలు అందివ్వాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పవార్ స్వప్నిల్ అన్నారు. మందస పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు, సిబ్బందితో మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందాలన్నారు. ఆసుపత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని అన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని వైద్యాధికారులకు ఆదేశించారు. అనంతరం ఆసుపత్రిలోని అన్ని వార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడుతూ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధికారులు ఇతర వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వీడీవీకేలతో గిరిజన మహిళల ఆర్థికాభివృద్ధి

వన్ ధన్ వికాస్ కేంద్రాలతో గిరిజన మహిళలు ఆర్థికాభివృద్ధి చెందుతున్నారని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పవార్ స్వప్నిల్ అన్నారు.

మందస మండలంలోని కిల్లోయికాలనీలోని గల వీడీవీకే కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వీడివీకే కేంద్రంలో ఉత్పత్తి చేస్తున్న వివిధ రకాల ఉత్పత్తులను పరిశీలించారు. వీడీవీకే ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామని అన్నారు. వీడీవీకే ఉత్పత్తుల తయారీలో నాణ్యత లోపించకూడదని అన్నారు.

కార్యక్రమంలో వెలుగు డిపిఎం రమణ ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







## మందసలోనే 'ఐటీడీఏ' ఏర్పాటు చేయాలి



**మందస, మే 8(వార్త):** మందసలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని గిరిజన శక్తి సంక్షేమ సంఘం నాయకులు, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మందసలో ఐటీడీఏ ఏర్పాటు చేయకపోవడంపై మందసలో నిరసన చేపట్టారు. మందస మండల పరిధిలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని, రిజర్వాయర్ల నుండి గిరిజనులకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగు నీరు అందించాలని, జీడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. మందస మండలంలోని గిరిజనుల భూసమస్యలను పరిష్కరించాలని, శ్రీకాకుళం జిల్లా గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్లో చేర్పించాలన్నారు. గిరిజన పంచాయతీలలో ప్రతీ గిరిజన గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించాలని, కొబ్బరిఊరు గేటు నుండి కొండలోగాం మీదగా కిల్లోయికాలనీ వరకు తారురోడ్డు మరమ్మత్తు చేయాలని కోరారు. అనంతరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి పవార్ స్వప్నిల్ కు ఒక వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గిరిజన శక్తి సంక్షేమ సంఘం అధ్యక్షుడు సవర నరసింహులు, కార్యదర్శి సవర హరికృష్ణ, సవర మాధవ రావు, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర కోశాధికారి కోనేరు రమేష్, మాజీ సర్పంచ్ సవర చంద్రశేఖర్, రాజు, జగ్గారావు. దశరథ, శ్రీను. కోదండరావు పాల్గొన్నారు.

## మంచి మార్కులు సాధించిన విద్యార్థులతో ర్యాలీ




**ఇచ్ఛాపురం మే 8(వార్త):** ఈదుపురం గ్రామంలోని కంద్రవార్డు హైస్కూల్‌లో పదో తరగతి లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులతో గ్రామంలో ఘనంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, గ్రామ యువకులు, గ్రామస్తులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా స్కూల్ హెడ్ మాస్టర్ ఉమామహేశ్వరి మాట్లాడుతూ, మత్స్యకార సంఘ పిల్లలు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. చదువుతోనే మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని తెలిపారు. యువత పిల్లల్లో బాధ్యతాభావం పెరగాలని హంగీర్ బెహరా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘ అధ్యక్షుడు గయ రామచంద్ర బెహరా, దోంబూరు బెహరా, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన వసతులు

**నరసన్నపేట, మే 8(వార్త):** ప్రైవేట్ పాఠశాలలతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య అందుబాటులో ఉన్నాయని ఎంఈవోలు పేడాడ దాలి నాయుడు, ఉప్పాడ శాంతారావు పేర్కొన్నారు. నరసన్నపేట మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో వారు పాల్గొని ప్రభుత్వ విద్యా సంస్థల ప్రాధాన్యతను వివరించారు. నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల వైపు వెళ్లి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవద్దని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యతో పాటు పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం వంటి అనేక సౌకర్యాలు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు

**నరసన్నపేట, మే 8(వార్త):** నరసన్నపేట మండల కేంద్రంలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లు, కొమ్మల తొలగింపు పనులను విద్యుత్ శాఖ అధికారులు విజయవంతంగా పూర్తి చేశారు. విద్యుత్ శాఖ ఏఈ బి. రామ్ చరణ్ గుప్తా ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం నుంచి ప్రత్యేకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొని ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. ఈ సందర్భంగా భద్రతా కారణాల దృష్ట్యా కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేసి పనులు నిర్వహించారు. రానున్న వర్షాకాలంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగానే ఈ పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం వల్ల ప్రమాదాలను నివారించడంతో పాటు విద్యుత్ అంతరాయాలు తగ్గే అవకాశం ఉందన్నారు. పనుల నిర్వహణలో సహకరించిన స్థానిక ప్రజలకు విద్యుత్ శాఖ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.



# ఒడిశా వేధింపులు, దాడుల నుంచి రక్షించండి

### -పీఓకు సరిహద్దు గిరిజనుల వేడుకోలు



**మందస, మే 8(వార్త):** ఒడిశా వేధింపులు, దాడుల నుంచి రక్షించాలని సరిహద్దు గ్రామాల గిరిజనులు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పవార్ స్వప్నిల్(సీతంపేట)ను వేడుకున్నారు. మందసలో జరిగిన గిరిజన ఐటీడీఏ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పీఓకు వినతిపత్రం అందజేశారు. ఆంధ్ర-ఒడిశా సరిహద్దు గిరిజన గ్రామాలపై ఒడిశా అధికారుల నుంచి దాడులు ఆపాలని కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ మాణిక్యపట్నం గిరిజనులపై ఒడిశా అధికారులు, పోలీసుల దౌర్జన్యం ఆపాలని, రెండు రాష్ట్రాల మధ్య ఉన్న సరిహద్దు సమస్య పరిష్కారానికి కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చొరవ చూపాలన్నారు. గత ఐదు సంవత్సరాల నుండి ఆంధ్రాలో ఉన్న గిరిజనుల భూములు, స్మశానాలు చెరువులు, రోడ్లు ఒడిశా అధికారులు మా భూబాగంలో ఉన్నాయని ఆక్రమించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రాష్ట్రాల మధ్య ఉన్న ఈ సమస్యను పరిష్కరించకుండా గిరిజనుల మధ్య సమస్యగా మార్చుతున్నారన్నారు. ఆంధ్ర ఒడిశా సరిహద్దు నిర్ణయించడం కోసం కేంద్ర ప్రభుత్వం జియోగ్రాఫికల్ సర్వే చేపట్టాలని అధికారులు చెబుతున్నారన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఈ సర్వే నిర్వహించడానికి ఉన్న ఆటంకాలు ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. మాణిక్యపట్నం గిరిజన గ్రామంలో సుమారు 30 గిరిజన కుటుంబాలు దశాబ్దాలుగా స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం మేరకు సాబకోట సచివాలయ సిబ్బంది జన గణన చేసి గోడలపై నెంబర్లు వేశారని, వీటిని ఒడిశా అధికారులు, పోలీసులు నంబర్లను దౌర్జన్యంగా చెరిపి వేసి, ఆయా ఇళ్లలో ఉన్న కుటుంబాలపై కేసులు పెడతామని బెదిరిస్తున్నారన్నారు. చేయని నేరానికి గిరిజనులను శిక్షించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. గతంలో సవర గురునాథ్ పై ఇటువంటి అభియోగమే చేస్తూ ఒఢిశా పోలీసులు కేసు పెట్టి కోర్టు చుట్టూ తిప్పుతున్నారని, పేద గిరిజనులపై ఇటువంటి తప్పుడు కేసులు పెట్టి కోర్టు చుట్టూ తిప్పడం అన్యాయమన్నారు. ప్రభుత్వమే న్యాయ సహాయం అందించాలని, కోర్టు ఖర్చుల నిమిత్తము ఆర్థిక సహాయం చేయాలన్నారు. ఈ గ్రామంలో నివసిస్తున్న 30కుటుంబాలు ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, ఓటు కార్డులు ఆంధ్రప్రదేశ్ పరిధిలోనే ఉన్నాయని, ఒడిశా అధికారులు వచ్చి గిరిజనులపై దాడులు చేయడం, తప్పుడు కేసులు పెట్టడం అన్యాయమన్నారు. దీనిపై రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు జోక్యం చేసుకొని సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు. సరిహద్దు గ్రామాలలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. గతంలో కూడా అనేక సార్లు మండల, జిల్లా అధికారులకు విన్నవించుకున్న పట్టించుకోలేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీనిపై ఐటీడీఏ పీఓ స్పందిస్తూ వెంటనే పోలీసులు ఆ గ్రామాన్ని సందర్శించి, గిరిజనులకు సహకరించాలన్నారు. ఐసీడీఎస్ అధికారులు ఆ గ్రామాలలో తరచూ సమావేశాలు జరిపి ప్రజలకు అండగా ఉండాలని అధికారులను ఆదేశించారు. సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు మట్ట ధర్మారావు, సవర బుగత, ఎస్.గణేష్, ఎస్.విప్రో, ఎస్.మధుసూదన్, ఎస్.సుదన్ తదితరులు పాల్గొన్నారు

# పలాసను జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

### -సీనియర్ న్యాయవాది దున్న లోకనాథం

**మందస, మే 8(వార్త):** పలాస జిల్లా కేంద్రంగా ప్రకటించడం చారిత్రిక అవసరమని సీనియర్ న్యాయవాది, అగ్నికుల క్షత్రియ సంఘ వ్యవస్థాపకుడు దున్న లోకనాథం అన్నారు. మందస మండలంలోని హరిపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో పలాస ఇచ్ఛాపురం, పాతపట్నం నియోజకవర్గాలు జిల్లా కేంద్రానికి 160 కిలోమీటర్లు దూరంగా ఉన్నాయని అన్నారు. దీనితో ఆయా నియోజకవర్గాల అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. ప్రభుత్వం పలాస ను జిల్లా గా ప్రకటించి తర్వాత వెనుకకు తీసుకోవడం ఏమిటని అయన ప్రశ్నించారు. ఉద్దాన ప్రాంతానికి దగ్గరలో ఉన్న పలాసను జిల్లా కేంద్రంగా ప్రకటిస్తే ఉద్దానప్రాంతం తో పాటు పల్లపు, గిరిజన ప్రాంతాలు కూడా అభివృద్ధి బాటలో పయనిస్తాయని ఆయన అన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలను విభజించి అప్పటికి శ్రీకాకుళం జిల్లాను మాత్రం విభజించకుండా ఉంచడం తమకు అన్యాయం చేయడమేనని ఆయన అన్నారు. కొత్త జిల్లా ఏర్పాటు వలన ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని పోటీ తత్వం తగ్గి నిరుద్యోగులకు అవకాశాలు లభిస్తాయని ఆయన అన్నారు. మెడికల్ కాలేజీలు,యూనివర్సిటీలు స్టడీ సెంటర్లు,స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్లు కూడా దగ్గర లోనే ఏర్పాటు అవుతాయన్నారు. పలాస జిల్లా ఏర్పాటు వల్ల విద్యా అవకాశాలు మెరుగుపడతాయని. తమ రాజకీయ భవిష్యత్ కోసం అని పలాస ను అన్యాయం చేయడం తగదని, రాష్ట్రము లో 12జిల్లాలను 28జిల్లాలుగా చేసినప్పటికీ ఒక్క శ్రీకాకులం జిల్లాను మాత్రమే ఆలా ఉంచడం వెనుక ఎవరు పాత్ర దాగివుందో ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పలాసను జిల్లా కేంద్రంగా ప్రకటించి ప్రజా మన్ననలు పొందాలని అన్నారు.






# ప్రభుత్వ బడుల్లో చేర్పిద్దాం..!

**పలాస, మే 8 (వార్త):** ప్రభుత్వ బడుల్లో చేర్పిద్దాం... తలరాతను మార్చుకుందామని పలాస ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవికుమార్ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో అడ్మిషన్లపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించి, పలు ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను వివరించారు. ఇటీవల నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు 80% ఉత్తీర్ణత సాధించారని ఉపాధ్యాయులు తెలిపారు. నాణ్యమైన విద్యతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలను ఉపయోగించుకోవాలని తల్లిదండ్రులను కోరారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి కృష్ణారావు, కె శ్రీనివాసులు, ఆనందరావు, కృష్ణారావు, త్రిలోచనారావు, కుశరాజ్, సతీష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## 'మన గ్రామం - మన బాధ్యత'తో పారిశుధ్యంపై ప్రత్యేక ప్రచారం




**నరసన్నపేట, మే 8(వార్త):** నరసన్నపేట నియోజకవర్గంలో పారిశుధ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు ఈవో పల్లి ద్రాక్షాయని తెలిపారు. శుక్రవారం 'మన గ్రామం -- మన బాధ్యత' నినాదంతో ఆటో ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలని సూచించారు. ప్రతిరోజూ ఇంటింటి నుంచి చెత్త సేకరణ జరుగుతుందని, రోడ్లపై చెత్త వేయవద్దని కోరారు. అదేవిధంగా రహదారులపై భవన నిర్మాణ సామగ్రి వేయడం వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు పారిశుధ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి రోడ్లపై నిర్మాణ సామగ్రి వేస్తే భారీగా అపరాధ రుసుము విధిస్తామని హెచ్చరించారు. పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈవో పిలుపునిచ్చారు.

## శక్తి యాప్‌పై అవగాహన



**నరసన్నపేట, మే 8(వార్త):** నరసన్నపేట మండలం ప్రశాంత్ నగర్‌లోని ఓ ప్రైవేట్ కోచింగ్ సెంటర్ వద్ద శుక్రవారం శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టెక్కలి డివిజన్‌కు చెందిన హెచ్‌సీ ఎం. గిరిధర్ మాట్లాడుతూ శక్తి యాప్ మొబైల్ ఫోన్‌లో ఉంటే పోలీస్ రక్షణ ఉన్నట్లేనని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలు, యువత వెంటనే సహాయం పొందేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందని వివరించారు. అదేవిధంగా జాతీయ రహదారులు, గ్రామీణ రహదారులపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులు, కాల్స్‌కు స్పందించవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, స్థానిక యువత పాల్గొన్నారు.

## కిల్లాంలో ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు



**నరసన్నపేట, మే 8(వార్త):** నరసన్నపేట మండలం కిల్లాం పంచాయతీలో ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శి ధర్మరాజు తెలిపారు. శుక్రవారం ఉదయం నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామంలోని రహదారులు, కాలువలు, పరిసర ప్రాంతాల్లో శుభ్రత చర్యలు చేపట్టారు. మాజీ సర్పంచ్ బోడి రామన్న సహకారంతో పారిశుధ్య పనులను వేగవంతంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామంలో కొన్ని ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండటంతో దానిని మళ్లించే చర్యలు చేపట్టామని తెలిపారు. దోమలు వ్యాప్తి చెందకుండా నివారణ చర్యల్లో భాగంగా బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నామని వివరించారు. ప్రజలు పరిశుభ్రత పాటిస్తూ పారిశుధ్య కార్యక్రమాలకు సహకరించాలని అధికారులు కోరారు.

## పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం అవగాహన ర్యాలీ

**నరసన్నపేట, మే 8 (వార్త):** నరసన్నపేట మండలం మాకివలస జడ్పీ ఉన్నత పాఠశాలలో అడ్మిషన్లపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వి. సింహాచలం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఈ ర్యాలీలో నీటి సంఘం అధ్యక్షుడు సిమ్మ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ యాళ్ల వేణుగోపాలరావు తదితరులు పాల్గొని గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను వివరించారు. ఇటీవల నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో పాఠశాలకు చెందిన 30 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఉపాధ్యాయులు తెలిపారు. నాణ్యమైన విద్యతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలను ఉపయోగించుకోవాలని తల్లిదండ్రులను కోరారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని అవగాహన కల్పించారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## శ్రీఅభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠలో దుదిష్టిపాత్రో



**మందస, మే 8(వార్త):** భారతీయ జనతాపార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఆధ్యాత్మిక వేత్త పొందర దుదిష్టిపాత్రో శ్రీఅభయ ఆంజనేయ విగ్రహం ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొన్నారు. మందస మండలంలోని తాళ్లగురంటి పంచాయతీలో గల చిన్నకోస్టా గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో మందస పట్టణానికి చెందిన పొందర దుదిష్టిపాత్రో భక్తులు, అనుచరులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులకు ఆయనకు ప్రత్యేకంగా ఆహ్వానించి, తీర్థ, ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా చిన్నకోస్టాలో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. భజనలు, హనుమాన్ సంకీర్తలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి.

## పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఘన సన్మానం



**పోలాకి, మే 8(వార్త):** పోలాకి మండలం మబగాం గ్రామంలోని స్వగృహంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ఈదులవలస ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులను నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ, వారి కృషి, పట్టుదలతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకొని కుటుంబానికి, పాఠశాలకు, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా లక్ష్యంతో కష్టపడి చదివితే అత్యుత్తమ ఫలితాలు సాధించగలరని ఈ విజయాలు నిరూపిస్తున్నాయని ఎమ్మెల్యే అన్నారు. విద్యార్థులకు అవసరమైన ప్రోత్సాహం, సహకారం భవిష్యత్తులో కూడా అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

## శాంతినికేతన్ స్కూల్ లో అమ్మకు వందనం



**ఇచ్ఛాపురం, మే 8 (వార్త):** స్థానిక శాంతి నికేతన్ స్కూల్లో అమ్మకు వందనం కార్యక్రమం నిర్వహించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి వేడుకలు సందర్భంగా రవీంద్రనాథ్ చిత్రపటానికి స్కూల్ చైర్మన్ డి కృష్ణమూర్తి రెడ్డి , సెక్రటరీ ఇంద్ర రెడ్డి లు పూలమాలతో సత్కరించారు. అనంతరం పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు, పదవ తరగతి ఉపాధ్యాయులు కృష్ణ చంద్ర పూరి , సురేఖ, శంకర్, పద్మజా, శాంతి, రాజ్యలక్ష్మి, రవి , శ్రీధర్, లను స్కూల్ చైర్మన్ డి. కృష్ణమూర్తి రెడ్డి సెక్రటరీ,ఇందిరా రెడ్డి స్కూల్ డైరెక్టర్స్ తేజశ్రీ, శృతి, సాలువాతో సన్మానం చేసి పుష్పగుచ్ఛని అందించారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజర్ కేసి పూరి ఉపాధ్యాయులు యశో, జయలక్ష్మి, పార్వతి, ప్రమీల సరోజినీ, ప్రియదర్శిని, శిరీష విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ విద్యాబోధన



**మందస, మే 8(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యా బోధన లభిస్తుందని, తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఐటీడీఏ పీఓ పవర్ స్వప్నిల్(సీతంపేట) పిలుపునిచ్చారు. మందస గ్రామంలో బడి పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. అనంతరం ముగ్గురు చిన్నారులను మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాల ఒరియాలో అడ్మిషన్లను ఐటీడీఏ పీఓ పవార్ స్వప్నిల్, పలాస ఆర్డీఓ ఆర్.అప్పలరాజుల చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మిస్క శ్రీకాంత్, మండల విద్యాశాఖ అధికారులు 1, 2 ఎం.లక్ష్మణరావు, ఎం.భాస్కరరావు మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలలో చదువుతున్న ఐదు సంవత్సరములు పూర్తయిన 302 మంది చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణచంద్రమహంతి, మంజుల మహరణ, సీఆర్పీలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 12వ వార్డులో ముమ్మర పారిశుధ్య పనులు

**నరసన్నపేట, మే 8(వార్త):** నరసన్నపేట పట్టణంలోని 12వ వార్డు పరిధిలో శుక్రవారం ముమ్మరంగా పారిశుధ్య పనులు నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో స్వచ్ఛాంధ్ర -- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా ఈ చర్యలు చేపట్టారు. ప్రత్యేక అధికారి మల్లేశ్వరరావు, అజీజ్ ఆధ్వర్యంలో సుమారు 30 మంది కార్మికులు పారిశుధ్య పనుల్లో పాల్గొన్నారు. రహదారుల శుభ్రత, చెత్త తొలగింపు, కాలువల పరిశుభ్రత వంటి కార్యక్రమాలను చేపట్టారు. ఈ నెల 16వ తేదీన ముఖ్యమంత్రి పర్యటన ఉండటంతో పట్టణాన్ని పరిశుభ్రంగా, అందంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు రావాడ గణపతిరావు తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పారిశుధ్య కార్యక్రమాలను వేగవంతంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. స్థానిక ప్రజలు కూడా పరిశుభ్రత పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని అధికారులు కోరారు.



# ప్రజల ఆశయాల సాధనకే టీడీపీ కేడర్ కృషి

### -ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



**నరసన్నపేట, మే 8(వార్త):** నరసన్నపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో క్లస్టర్, మండల పార్టీ అధ్యక్షులతో విస్తృత స్థాయి కేడర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి బగ్గు అర్చన ముఖ్య అతిథులుగా హాజరై పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామ స్థాయి కార్యకలాపాలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పార్టీపై ప్రజల్లో విశ్వాసం పెంచేలా పనిచేయాలని క్లస్టర్, మండల అధ్యక్షులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి బగ్గు అర్చన మాట్లాడుతూ పార్టీ అధినేత ఆశయాలకు అనుగుణంగా ప్రతి కార్యకర్త సమన్వయంతో ముందుకు సాగాలని తెలిపారు. మహిళలు, యువతను పెద్ద ఎత్తున పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని, సోషల్ మీడియా వేదికగా పార్టీ సిద్ధాంతాలను మరింత ప్రభావవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ రోణంకి కృష్ణన్నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, అడపా చంద్రశేఖర్, వెలమల రాజేంద్ర నాయుడు, కత్తిరి వెంకటరమణ పాల్గొన్నారు.

# మాకనపల్లిలో పోలీసుల అవగాహన సదస్సు

### -బెట్టింగ్ ఆన్‌లైన్ గేమ్స్ జోలికి వెళ్లొద్దు

### -ఎస్సై ఆర్ నరసింహమూర్తి హెచ్చరిక

**పలాస, మే 8 (వార్త):** పలాస మండలం మాకనపల్లిలో గ్రామంలో పోలీసులు అవగాహన గర్జనతో ప్రజల్లో చైతన్యం నింపారు. కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ ఎస్సై ఆర్. నరసింహమూర్తి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది గ్రామాన్ని సందర్శించారు. గ్రామ కూడలి వద్ద ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎస్సై నరసింహమూర్తి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా గ్రామస్తులకు కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా నారీ శక్తి ప్రాముఖ్యత, మహిళల హక్కులు, కొత్త చట్టాలపై అవగాహన కల్పిస్తూ మహిళలు ధైర్యంగా ముందుకు రావాలని ప్రోత్సహించారు. గ్రామ భద్రతపై ప్రత్యేకంగా దృష్టి సారించిన పోలీసులు, దేవాలయాలు, మసీదులు, చర్చిల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామంలో జరిగే పండుగలు, ఉత్సవాల సమాచారం ముందుగానే పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు. నేటి సమాజాన్ని వేధిస్తున్న సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, బెట్టింగ్, గ్యాంబ్లింగ్, గంజాయి, నాటు సారా అక్రమ రవాణా వంటి అంశాలపై తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాల్లో పాల్గొంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాల్యవివాహాలు, మహిళలపై జరుగుతున్న నేరాలు వంటి సున్నిత అంశాలపై ప్రజల్లో చైతన్యం పెంచుతూ, అత్యవసర పరిస్థితుల్లో 112 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా గ్రామంలో శాంతి భద్రతలు కాపాడటంలో ప్రజల భాగస్వా మ్యం ఎంతో కీలకమని పోలీసులు పేర్కొన్నారు. పోలీసులు ఇచ్చిన సూచనలకు గ్రామస్తులు సానుకూలంగా స్పందించి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. మొత్తంగా కోసంగిపురంలో పోలీసులు నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమం గ్రామ ప్రజల్లో చైతన్యాన్ని నింపుతూ, నేరాలపై కఠిన సందేశాన్ని ఇచ్చింది. ఈ కార్యక్రమంలో కాశీబుగ్గ పోలీసులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




# వేసవి కిశోర వికాసం కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలి



**పలాస, మే 8(వార్త):** వేసవి కిశోర వికాసం కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ లతా అన్నారు. శుక్రవారం అల్లుకొల్ల అంగనవాడి కేంద్రంలో వాసవి కిషోర్ కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ 11 నుండి 18 సంవత్సరాల వయస్సు గల బాలికలకు రక్తహీనత ఏర్పడుతుందని చెప్పారు.రక్తహీనత అంటే ఏమిటి?అని, శరీరంలోని ఎర్ర రక్త కణాలలో ఉండే హిమోగ్లోబిన్ స్థాయిలు సాధారణం కంటే తక్కువగా ఉండటాన్ని రక్తహీనత అంటారని తెలిపారు. హిమోగ్లోబిన్ శరీరంలోని అన్ని కణాలకు ఆక్సిజన్‌ను సరఫరా చేస్తుందని, ఇది తగ్గడం వల్ల శరీరం బలహీనంగా మారుతుందని, లక్షణాలుతరచుగా అలసట, నీరసం, బలహీనత, చర్మం పాలిపోయినట్లుగా (లేత రంగులో) కనిపించడం.చిన్న పనులకే ఆయాసం రావడం లేదా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందని, తలతిరగడం, తలనొప్పి, ఏకాగ్రత తగ్గడం.కాళ్ళు, చేతులు చల్లగా అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయని చెప్పారు. వీటికి ముఖ్య కారణాలు పోషకాహార లోపమని, ఆహారంలో ఐరన్ (ఇనుము), ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి 12 సరిగ్గా లేకపోవడం.రక్తస్రావం అవుతుంటాయని చెప్పారు. గాయాల వల్ల లేదా ఆడవారిలో నెలసరి సమయంలో అధిక రక్తస్రావం జరగడం. నులిపురుగులు ఉండటం లేదా కొన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధులు. నివారణ, చికిత్సఐరన్ అధికంగా ఉండే ఆహారం ఆకుకూరలు (తోటకూర, పాలకూర), బెల్లం, వేరుశనగలు, ఎండుద్రాక్ష, ఖర్జూరం, మరియు మాంసాహారం తీసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 11-18 ఏళ్ల బాలికలకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు, పోషకాహార పంపిణీ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఢిల్లేశ్వరి, సంతోషిని, ఆరోగ్య కార్యకర్త, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల్లో జోష్!

### -త్వరలో మత్స్యకారుల సేవలో

### -జూన్‌లో వేట విరామ పరిహారం

### -గ్రామాల్లో కొనసాగుతున్న ఈకేవైసీ

**సోంపేట, మే 8(వార్త):** తీర ప్రాంత మత్స్యకారి గ్రామాల్లో ప్రజల్లో జోష్ నెలకొంది. వచ్చే జూన్ నెలలో రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సేవలో పథకం కింద సముద్రపు వేట సాగించే మసికారులకు వేటవిరామ సహాయం కింద ఒక్కొక్కరికి 20000 రూపాయలు లబ్ధి చేకూర్చనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖలు వేట సాగించే మత్స్యకారుల వివరాలను సేకరిస్తూ వారి నుంచి వేలిముద్రలు సేకరించి పీకేవైసీ గ్రామాల్లో చేపడుతున్నారు. వేటవిరామం ప్రకటించడంతో చెన్నై ముంబై గోవా తదితర ప్రాంతాలకు వేటకు వెళ్లిన మత్స్యకారులు ఇప్పటికే గ్రామాలకు చేరుకున్నారు. గ్రామాల్లో గల మత్స్యకారులకు నుంచి ఈ కేవైసీ చేస్తూ సిబ్బంది బిజీగా ఉన్నారు. అలాగే వారి యొక్క అకౌంట్లు ఐడి కార్డులు పరిశీలించి వాటిలో సమస్యలు ఉంటే త్వరగా సరిదిద్దుకోవాలంటూ సమాచారం ఇస్తున్నారు. మండలంలో ఇసకల పాలెం గొల్లగండి రామయ్యపట్నం బారువ కొత్తూరు ఏడొళ్ళ పాలెం తదితర గ్రామాల్లో మత్స్యకారులు ఈ పథకం నిధులు ఎప్పుడెప్పుడా అంటూ ఎదురుచూస్తున్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts college wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546